క్లుప్తంగా

నానో యూరియాతో పర్యావరణ పరిరక్షణ



డ్రోన్‌తో యూరియా పిచికారీ విధానాన్ని పరిశీలిస్తున్న ఏవో శృతి

వేల్పూర్: నానో యూరియా వాడకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని మండల వ్యవసాయాధికారిణి శృతి పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు బాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతు యాల్లప్రవీణ్ డ్రోన్ సహాయంతో చేపడుతున్న నానో యూరియా పిచికారీ విధానాన్ని ఆమె శనివారం పరిశీలించారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. రైతులు నానో యూరియా వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు గంగారెడ్డి, బాల్‌రెడ్డి, సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులతో అధికారులు

పెర్కిట్: వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ రమేశ్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ రమేశ్ మాట్లాడుతూ.. రైతులు మోటార్ స్టార్టర్ల వద్ద భద్రత ప్రమాణాలతో ఎర్తింగ్ చేయించుకోవడం వల్ల విద్యుదాఘాతం కలగకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, రైతులు పాల్గొన్నారు.

మంచినీటి శుద్ధి కేంద్రం పరిశీలన



మంచినీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఆర్మూర్‌టౌన్: బాల్కొండలో ఆర్మూర్ పట్టణానికి నీటిని సరఫరా చేసే మంచినీటి శుద్ధి కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు, ఇన్‌చార్జి డీఈ భూమేశ్వర్ శనివారం పరిశీలించారు. వేసవి కాలంలో ప్రజలు నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

బోధన్‌టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంవో రహీం అన్నారు. శనివారం పట్టణంలోని చైతన్య ఒకేషనల్ కళాశాలలో ఫేర్‌వెల్‌డే నిర్వహించారు. ఒకేషనల్ విద్యతో త్వరగా ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీలతో పాటు గతేడాది మంచి ఉత్తీర్ణత సాధించి న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కిషన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శోభ, అధ్యాపకులు రేఖ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రామదాసు జయంతి

రుద్రూర్: మండల కేంద్రంలోని పతంజలి యోగ భవనంలో శనివారం సమర్థ రామదాసు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించి, సూర్య నమస్కారాలు సాధన చేయించారు. అనంతరం పతంజలి యోగ సమితి సోషల్ మీడియా కన్వీనర్ విశ్వనాథ్ మహాజన్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు ప్రతి రోజు వేయి సూర్య నమస్కారాలు చేసే వారని అన్నారు. కార్యక్రమంలో కేవీ మోహన్, జి పురుషోత్తం, పుట్టి ప్రకాశ్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష

ఆర్మూర్‌టౌన్/ మాక్లూర్: ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 నుంచి 9వ తరగతి ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రానికి ఉదయం 10గంటల లోపు చేరుకోవాలని సూచించారు. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ దాత్రిక వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి కేటాయించిన సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు.

పనులు పూర్తయ్యేనా..?

- బాల్కొండ ఉన్నత పాఠశాలలో అదనపు గదులకు రూ. 27 లక్షలు మంజూరు
- నత్తనడకన సాగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



పునాది స్థాయిలోనే ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి గతేడాది పీఎంశ్రీ నిధులు రూ. 27 లక్షలు మంజూరయ్యాయి. పనులకు సంబంధించి ఈ విద్యాసంవత్సరంలో టెండర్లు పూర్తయ్యాయి. గత రెండు నెలల క్రితం పనులను ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు పునాది స్థాయిలోనే పనులు జరిగాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న గదుల్లో ఒకటి ల్యాబ్, మరొకటి తరగతి కోసం వినియోగించుకోవాలని నిబంధనల్లో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు పనులు వేగవంతం కావడం లేదు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో కలిపి 401 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేకపోవడంతో ఉపాధ్యాయులు చెట్ల కిందే పాఠాలను బోధిస్తున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న తరగతి గదులు పూర్తయినా మరో రెండు తరగతి గదుల కొరత ఉంది.

ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న గదులకు పీఎంశ్రీ నిధుల నుంచే విడుదల చేస్తారు. పనులు చేపట్టిన ప్రకారం నిధులను డ్రా చేసుకునే అవకాశం ఉంది. కానీ పనులు మాత్రం వేగవంతం కావడం లేదు. రూ.10లక్షల50 వేల నిధులు బ్యాంకు ఖాతాలోనే ఉంది. పనులు చేపట్టే ఇంజినీర్ వాల్యువేషన్ సర్టిఫికెట్ ప్రకారం డ్రా చేసుకునే అవకాశం ఉన్నా అలా జరగడం లేదు. ఇకనైనా ఉన్నధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరగా పూర్తయ్యేలా చూస్తాం

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. పనులు చేపట్టిన ప్రకారం బిల్లులు వెంటనే తీసుకునే అవకాశం ఉంది. ఇతర పనుల మాదిరిగా ఆలస్యమయ్యే అవకాశం లేదని కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నా..



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- చర్చకు సిద్ధమే.. హామీలు నెరవేర్చి రావాలి
- నియోజకవర్గ పట్టభద్రుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బోధన్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తామని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హామీల అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఏ ఒక్క హామీకి కనీసం కార్యాచరణ లేదని, చర్చకు రమ్మనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ పట్టభద్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని, నిరుద్యోగులకు విస్మరించి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల్లోనే రూ. లక్షా30 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రజల ఆకాంక్షకు అ నుగుణంగా సుస్థిర పాలన అందిస్తున్నారని అన్నా రు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీజేపీ బలపర్చిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డిలను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, చింత రామచంద్రారెడ్డి, బద్దం ప్రేమేశ్వర్ రెడ్డి, మంత్రి సుధీర సుధాకర్‌చారి, మేక సంతోష్, కొలిపాక బాలరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల సమావేశాలు చేపట్టారు. బీజేపీ నాయకులు పార్టీ అభ్యర్థి అంజిరెడ్డిని, కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డిని, బీఎస్పీ నాయకులు ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. సాక్షి నెట్‌వర్క్



మాక్లూర్: మాణిక్‌బండార్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



బోధన్‌లో మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



రుద్రూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి

పెర్కిట్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డాక్టర్ అశోక్, హెచ్‌ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాక్లూర్: తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాణిక్‌బండార్ గ్రామస్తులు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మాణిక్‌బండార్ శివారులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పానుగంటి గంగారెడ్డి అతని కుమారులు కబ్జాకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాయ్‌సింగ్, ఎండీ గౌస్, వినోద్‌కుమార్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



రాజారాంనగర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



వేల్పూర్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీఈవో

ఆర్మూర్‌టౌన్/ వేల్పూర్: ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని హెచ్‌ఎంకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీఈవో సాయిలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజనానికి వాడే వంటపాత్రలు శుభ్రంగా ఉండాలన్నారు. నాణ్యమైన కూరగాలతో వండాలని సూచించారు.

చికెన్ మేళాకు విశేష స్పందన



ప్రజలకు చికెన్, ఎగ్ స్నాక్స్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో వెక్‌కాబ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చికెన్ అండ్ ఎగ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వైరస్ లేదని, ఒకవేళ ఉన్నా 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం వల్ల వైరస్ పూర్తిగా నాశనం అవుతుందని అన్నారు. అనంతరం ప్రజలకు చికెన్ ఫ్రై ముక్కలు, ఎగ్ స్నాక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అవసరమగు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంఈవో కట్ట శ్రీనివాస్, ఎస్సై సాయన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పక్షుల కోసం గూళ్లు ఏర్పాటు



చెట్టుకు గూడును ఏర్పాటు చేసిన విద్యార్థులు

డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్ శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వినూత్న ఆలోచన చేశారు. వేసవి నేపథ్యంలో పక్షులకు నీడను కల్పించడానికి అట్ట ముక్కలతో గూళ్లను తయారు చేసి పాఠశాల ప్రాంగణంలో చెట్ల వద్ద ఏర్పాటు చేశారు. నీరు, ఆహారం కోసం ప్రత్యేకంగా డబ్బాలను అమర్చారు. అనంతరం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు.

ఎమ్మెల్యే ఆరోపణలు అర్థరహితం



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్

కమ్మర్‌పల్లి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు రుణమాఫీ చేయక, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వక 1200 మంది రైతుల ఆత్మహత్యలకు కారణం.. మాజీ సీఎం కేసీఆర్ పాలన కాదా అని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్ ప్రశ్నించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఆత్మహత్యలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పసుపు ధర క్వింటాలుకు రూ. 5వేలు దాట లేదని గుర్తుచేశారు. పసుపు రైతులను ఆదుకుంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై అర్థంలేని ఆరోపణలు చేయడం ప్రశాంత్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల శివకుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, ఏర్గట్ల మండలాధ్యక్షుడు దేవారెడ్డి, రాజాముత్యం, పల్లె శేఖర్, చరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



బండ్ల భీమన్న

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని శెట్‌పల్లికి చెందిన బండ్ల భీమన్న(55) అనే వ్యక్తి చెరువులో పడి మరణించాడు. నాలుగు రోజుల నుంచి కనిపించకుండా పోయిన ఆయన మృతదేహం శనివారం స్థానిక చెరువులో లభ్యమైంది. ఒంటరిగా జీవిస్తున్న భీమన్న నాలుగు రోజుల కింద లక్ష్మి కాలువ వద్దకు వెళ్లి అందులోకి స్నానం కోసం దిగగా బయటకు రాలేదు. కాలువ ప్రవాహానికి కొట్టుకువచ్చి చెరువు వద్ద శవమై తేలాడు. మృతుడి తమ్ముడు రాజన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు బైక్‌ల చోరీ

నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వారాంతపు కూరగాయల సంతలో బైక్ అపహరణకు గురైంది. రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన చిన్న సాయిలు పోస్టాఫీసు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి సంతకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎడపల్లిలో..

ఖలీల్‌వాడి: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన దువ్వ ప్రదీప్ తన ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఏపీ 25ఏడీ 5440 బైక్ సమాచారం తెలిస్తే 85008 38985 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – ది డెవిల్స్ చైర్(తెలుగు)-10.40, రామం రాఘవం(తెలుగు)-1.55, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-4.30, 7.20, 10.10
- స్క్రీన్-2 – రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20, బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్-3– జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-10.10, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.00, ఛావా(హిందీ)-4.10, బాపు(తెలుగు)-7.30, తండేల్(తెలుగు)-10.05
- స్క్రీన్-4 బాపు(తెలుగు)-10.30, తండేల్ (తెలుగు)-1.05, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-4.10, ఛావా (తెలుగు) - 7.10, 10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20
- స్క్రీన్-2 ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
- స్క్రీన్-3 తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్-2 ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
- స్క్రీన్-3 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45
- స్క్రీన్ -4 ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40

- లలితామహల్ తండేల్(తెలుగు)
- దేవి జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15
- నటరాజ్ ఛావా(హిందీ)
- విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,700	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	82,710		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800

సంక్షిప్తం

ఘనంగా కవల పిల్లల దినోత్సవం

పెర్కిట్: మామిడిపల్లిలో ఉన్న విజయ్‌హై స్కూల్‌లో శనివారం కవల పిల్లల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కవితా దివాకర్, హెచ్‌ఎం రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ పి ఎస్తేర్ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు నరేందర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం చౌట్‌పల్లిలో గుండ్ల మహేశ్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు గడ్డం స్వామి, కుంట ప్రతాప్‌రెడ్డి, మైలారం సుధాకర్ తదితరులు ఉన్నారు.

జడ్జికి పుస్తకం అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టులో సామాజిక సేవకుడు పట్వారి తులసికుమార్ సోదరుడు విశ్రాంత ఐఏఎస్ అధికారి విక్రమ్ సింహారావు రచించిన పుస్తకాన్ని సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానాకు శనివారం అందజేశారు. విద్యార్థుల మానసిక పరివర్తన, వివిధ అంశాలతో ఈ పుస్తకం రూపొందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో మెంటల్ వెల్నెస్ వారోత్సవాల భాగంగా విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు క్లబ్ సభ్యులు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, సభ్యులు తిరుపతి, విజయానంద్, ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ బిల్లులు చెల్లించాలి

వర్ని: గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలకు బకాయి ఉన్న బిల్లులు చెల్లించాలని బీజేపీ మోస్రా మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మోస్రా తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, కొమ్మిరె సాయిలు, స్వామి గౌడ్, సుదర్శన్ గౌడ్, లింగం, హన్మ గౌడ్, లచ్చన్న పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టుల వారిగా శనివారం అవగాహన కల్పించారు. టీ సాట్ ద్వారా విద్యార్థులకు ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విద్యార్థులకు ప్రత్యేకమైన సందేశాలు ఇచ్చారని ఎంఈవో రాజేశ్వర్ తెలిపారు. హెచ్‌ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరాలో పశువైద్య శిబిరం

బోధన్: సాలురా మండల కేంద్రంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. వెటర్నరీ వైద్యుడు సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి, సాధారణ చికిత్సలు చేశారు. పలు జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్లు అభిజిత్, రియా, అనిత, ఆకాంక్ష, గోపాల మిత్ర సూపర్‌వైజర్ శ్రీకర్, గోపాలమిత్రలు సురేశ్, దత్తు, ఆరిఫ్ పాల్గొన్నారు

రైతులు జాగ్రత్తగా ఉండాలి

ఎడపల్లి: పీఎం కిసాన్ నమోదు చేస్తామని కొందరు గ్రామాల్లో డబ్బులు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సిద్ధరామేశ్వర్ శనివారం పేర్కొన్నారు. పీఎం కిసాన్ నమోదును మండల వ్యవసాయాధికారులు మాత్రమే చేస్తారని అన్నారు. రైతులు పీఎం కిసాన్ పథకంపై స్థానిక ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.